ప్రజాశక్తి
మంగళవారం 13 మే 2025
5
అల్లూరి సీతారామరాజు

ఉపాధి సొమ్ము చెల్లింపులో నిర్లక్ష్యం వద్దు

ప్రజాశక్తి -అనంతగిరి:జాతీయ గ్రామీణ ఉపాధి హామీ కూలీలకు వేతనాలు చెల్లింపులో సిబ్బంది నిర్లక్ష్యం వహించవద్దని ఎంపీడీవో ఎ వివి. కుమార్ అన్నారు సోమవారం మండలంలోని చిలకలగెడ్డ పంచాయతీ గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను పరిశీలించారు. పనుల సమయంలో కూలీలకు ఎదురవుతున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఉపాధి హామీ చట్టం ప్రకారం పనులు జరిగిన వారం రోజులకే పేమెంట్లు చెల్లించాలన్నారు. ఉదయం 6 గంటల నుండి 11 గంటల వరకు పనులు చేపట్టాలని సూచించారు. మండలంలోని 24 పంచాయతీ పరిధిలో 60 తాగునీటి తొట్టెలకుగాను 34 పూర్తి అయ్యాయన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

సందడిగా మోదకొండమ్మ ఉత్సవం

▶▶ఆకట్టుకున్న విద్యుత్ వెలుగులు ▶▶అలరించిన ప్రదర్శనలు ▶▶నేడు అనుపోత్సవం

విద్యుత్ సెట్టింగ్ వద్ద భారీగా జన సందోహం

ప్రజాశక్తి-పాడేరు టౌన్: మన్యం ప్రజల ఆరాధ్య దేవత మోదకొండమ్మ ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. రెండో రోజు సోమవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. వేకువజాము నుంచి అమ్మవారి దర్శనానికి భక్తులు పోటెత్తారు. ఆలయంలోని అమ్మవారిని, శతకంపట్టు వద్ద కొలువైన ఉత్సవ విగ్రహాన్ని భక్తులు, పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. ఆలయ, ఉత్సవ కమిటీ సభ్యులు స్వాగతం పలికారు. చిన్నా, పెద్దలకు వినోదం అందించేందుకు స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద గ్రౌండులో జెయింట్ వీల్, డ్రాగన్ ట్రైన్, ప్లే జోన్‌లో పలు రకాల చిన్నపిల్లల ఆటల పరికరాలను, ప్రత్యేక కార్యక్రమాలను పెద్ద ఎత్తున ఏర్పాటు చేయడంతో సందడి వాతావరణం కనిపించింది. వివిధ రకాల ప్రదర్శనలు కొనసాగాయి.

మెరిసిపోతున్న పాడేరు..

ఉత్సవాల సందర్భంగా పాడేరు పట్టణమంతా విద్యుత్తు దీప కాంతులతో మెరిసిపోతోంది. పట్టణమంతా సర్వాంగ సుందరంగా విద్యుత్ అలంకరణ పనులు ఉన్నాయి. అంబేద్కర్ సెంటర్ నుంచి అరకు, విశాఖ, చింతపల్లి వెళ్లే మెయిన్ రోడ్డు పైన పలు రంగులతో కూడిన సీరియల్ సెట్‌లతో విద్యుత్ అలంకరణ చేశారు. పట్టణంలోని మెయిన్ రోడ్డులో ఆయా చోట్ల భారీ విద్యుత్ సెట్టింగ్‌ల కోసం కటౌట్‌లు పెట్టారు. పట్టణంలోని కూడళ్ళలో ఏర్పాటు చేసిన దేవత రూపాల లైటింగ్ సెట్లు ఆకర్షణీయంగా ఉన్నాయి. ఆలయానికి సంప్రదాయంగా ముస్తాబు చేయగా, శతకంపట్టు పందిరిని సుందరంగా తీర్చిదిద్దారు. పట్టణంలో రహదారులన్నీ విద్యుద్దీపాలంకరణలతో కళకళ లాడుతున్నాయి.

భారీ బందోబస్తు ఏర్పాటు..

కళాకారుల నృత్యప్రదర్శన

900 మంది పోలీసులతో పటిష్ట భద్రత కల్పిస్తున్నారు. డ్రోన్ లు, సీసీ కెమెరాలు, శక్తి బృందాలు, డాగ్ స్క్వాడ్ లతో నిరంతరం పర్యవేక్షణ చేస్తున్నారు. ప్రముఖులు పలువురు రాజకీయ నాయకులు వస్తుండటంతో పోలీసులు జాతరలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా జిల్లా ఎస్ పి అమిత్ బర్దార్ ఆదేశాలతో భద్రత ఏర్పాట్లను కట్టుదిట్టం చేశారు. మావోయిస్టు ప్రభావిత ప్రాంతం కావడంతో ముందస్తు చర్యల్లో భాగంగా పాడేరు శివారు ప్రాంతాల్లో క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఉత్సవాల నేపథ్యంలో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేశారు. భారీ వాహనాలను మూడు రోజులపాటు ఘాట్ రోడ్డులో, పాడేరు పట్టణంలోకి అనుమతించలేదు. వాహన రద్దీ నియంత్రించేందుకు ట్రాఫిక్‌ను వివిధ మార్గాల్లో మళ్ళించారు.

నేడు అనుపోత్సవం..

ఉత్సవాల్లో భాగంగా ముగింపు రోజైన ఈనెల13న మంగళవారం నాడు అనుపోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఉత్సవ కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆదివారం శతకంపట్టులో కొలువుతీరిన మోదకొండమ్మ భక్తుల పూజలు అందుకుంటున్నది. ఉదయం, సాయంత్రం వేళల్లో అక్కడ డప్పులు మోతలతో అమ్మవారికి సేవలు అందిస్తున్నారు. మోదకొండమ్మ ఆలయంలో కొలువుతీరిన ఉత్సవ విగ్రహాన్ని, అమ్మవారి పాదాలను ఉత్సవాల్లో తొలి రోజైన ఆదివారం ఉదయం భారీ ఊరేగింపుతో తీసుకెళ్లి శతకంపట్టులో కొలువుదీర్చారు. రెండు రోజులు (సోమ, మంగళవారాలు) శతకంపట్టు వద్దే ప్రత్యేక పూజలు నిర్వహించారు. మూడో రోజు మంగళవారం మధ్యాహ్నం అమ్మవారిని, పాదాలను తిరిగి ఆలయానికి చేరుస్తారు. ఈ సందర్భంగా నిర్వహించే అనుపోత్సవం అత్యంత వైభవంగా జరుగుతుంది. తొలి రోజుకు మించి ఊరేగింపులో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొంటారు. రకరకాల నృత్యాలు, వేషాలు, డప్పులు వాయిద్యాలు సందడి వాతావరణంలో ఉత్సవ విగ్రహాన్ని, పాదాలను పట్టణ వీధుల్లో ఊరేగింపు జరుగుతుంది. అమ్మవారిని తిలకించేందుకు వేలాదిగా భక్తులు తరలివస్తారు.

శతకంపట్టు వద్ద బారులు తీరిన భక్తులు

అమ్మవారిని, పాదాలను తిరిగి ఆలయానికి చేర్చడంతో ఉత్సవాలు ముగుస్తాయి. అనుపోత్సవం ముగిసిన తర్వాత నిర్వహించే బాణాసంచా కాల్పులు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి. మంగళవారం రాత్రంతా భక్తులను అలరించేందుకు పలుచోట్ల సినీ, టీవీ కళాకారులతో సాంస్కృతిక కార్యక్రమాలు, గిరిజనులతో జానపద కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. భక్తులు ఈ కార్యక్రమాలను తిలకించి బుధవారం ఉదయం స్వస్థలాలకు తిరుగు ప్రయాణమవుతారు.

మోదకొండమ్మను దర్శించుకున్న ప్రముఖులు

పాడేరు టౌన్: మోదకొండమ్మను ఒంగోలు ఎస్‌పి ఎ.ఆర్.దామోదర్ సతీ సమేతంగా, అరకు ఎంపి గుమ్మ తనూజరాణి దంపతులు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారికి ఆలయ కమిటీ ప్రతినిధులు ఘనంగా స్వాగతం పలికారు. శాలువాలతో సత్కరించి అమ్మవారి చిత్రపటాలను బహుకరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ఎం.విశ్వేశ్వరరాజు, మాజీ ఎమ్మెల్యే చెట్టి ఫాల్గుణ, తదితరులు పాల్గొన్నారు.


ఎంపీ దంపతులకు జ్ఞాపికను అందజేస్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులు

ఎస్‌బిఐ ఆధ్వర్యాన మజ్జిగ పంపిణీ

ప్రజాశక్తి -పాడేరు: పాడేరు పట్టణంలో జరుగుతున్న మోదకొండమ్మ అమ్మవారి ఉత్సవాలకు వచ్చిన భక్తులకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా పాడేరు బ్రాంచ్ ఆధ్వర్యాన చల్లని మజ్జిగ పంపిణీ చేశారు. పట్టణంలోని ప్రధాన రహదారి పక్కన బ్యాంక్ ఆవరణలో ఏర్పాటు చేసిన ఈ మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని ఎస్‌బిఐ చీఫ్ మేనేజర్ కిషోర్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఉత్సవాలకు తరలివచ్చే వేలాదిమంది భక్తులకు దాహార్తిని తీర్చేందుకు ఈ మజ్జిగ పంపిణీని చేపడుతున్నామని తెలిపారు. మంగళవారం రోజున కూడా ఉదయం నుంచి సాయంత్రం వరకు మజ్జిగ పంపిణీ కొనసాగిస్తామని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో స్టేట్ బ్యాంక్ అధికారులు రవి కిరణ్ శ్రీనివాస్ నాయుడు, బంగారు రాజు, డిఎంలు ఎన్ శ్రీనివాస్, నరసింహమూర్తి, బి కిరణ్ కుమార్, వి కుమార్, శివ, ఎం సూర్య, సత్యనారాయణ, మన్మధ పాల్గొన్నారు.

మజ్జిగను పంపిణీ చేస్తున్న ఎస్‌బిఐ అధికారులు

బావ మరుదుల దారుణ హత్య

ఘాతుకానికి పాల్పడిన బావ - మరొకరికి తీవ్రగాయాలు

కిముడు కృష్ణ

కిముడు రాజు

వంతల గెన్ను (నిందితుడు)

ప్రజాశక్తి -సీలేరు: జిల్లాలోని జికె వీధి మండలం సీలేరు మేజరు పంచాయతీ పరిధి జిడిసి క్యాంపులో ఆదివారం అర్ధరాత్రి ఇద్దరు వ్యక్తులు హత్యకు గురికాగా, మరొక వ్యక్తి తీవ్ర గాయాలపాలయ్యాడు. వివరాలిలా ఉన్నాయి. జిడిసి క్యాంపులో మామిడి సీతమ్మ అనారోగ్యంతో బాధపడుతూ ఆదివారం మృతి చెందింది. విషయం తెలుసుకున్న వారి బంధువులు పరామర్శించడానికి ఒరిస్సా మల్కనగిరి జిల్లా నవరంగపూర్ మండలం దొరగూడా పంచాయతీ ఇంద్రావతికి చెందిన కిముడు కృష్ణ (46) చిత్రకొండకు తన తమ్ముడు కిముడు రాజు (36) ఇరువురూ తమ భార్యలతో కలిసి వచ్చి అంత్యక్రియల్లో పాల్గొన్నారు. అనంతరం అదే గ్రామంలో ఉంటున్న వారి బావ వంతల గెన్ను బావమరుదులు కృష్ణ, రాజులను రాత్రి తమ ఇంటి వద్ద ఉండిపోవాలని కోరాడు. దానికి వారిరువురూ సరే అని ఒప్పుకున్నారు. వారిరువురిని వెంటపెట్టుకుని గెన్ను ఆదివారం రాత్రి సీలేరు వచ్చి వారితో కలసి మద్యం తాగాడు. అనంతరం ఇంకొక మద్యం బాటిల్‌ను ఇంటికి తీసుకెళ్లి మళ్లీ మద్యం తాగారు. తర్వాత గెన్నును కృష్ణ, రాజు ఇరువురూ తమ అక్క వంతల మణిని తరచూ ఎందుకు కొడుతున్నావు అని నిలదీసారు. తమ అక్కను తమతో పాటూ తీసుకెళ్లిపోతామని చెప్పారు. అప్పటికే మద్యం మత్తులో ఉన్న గెన్ను బావమరుదులను కొట్టేందుకు ప్రయత్నించాడు. అప్రమత్తమైన కిముడు కృష్ణ గెన్ను గొంతు గట్టిగా పట్టుకున్నాడు. చంపుతారనే భయంతో వారి నుంచి చాకచక్యంగా గెన్ను విడిపించుకున్నాడు. అనంతరం ఇంట్లో ఉన్న బల్లెం తీసుకొచ్చి ముందు కిముడు కృష్ణ కడుపులో తీవ్రంగా పొడిచాడు. అనంతరం కిముడు రాజు చాతీపై బలంగా పొడిచాడు. దీంతో రాజు పెద్దగా కేకలు వేశాడు. గెన్ను ఇంటి పక్కనే ఉంటున్న సుశీల కేకలు విని పక్కింట్లో ఏదో జరుగుతోందనే అనుమానంతో తన కుమారుడు పిలక రాజును నిద్ర లేపింది. పిలక రాజు గెన్ను ఇంటి వద్దకు చేరుకుని వారిని చంపవద్దని అడ్డుకునే ప్రయత్నం చేశాడు. దీంతో గెన్ను బల్లెంతో ఆయన ఎడమచేతిపై గాయపరిచాడు. అనంతరం గెన్ను పారిపోయాడు. కిముడు కృష్ణ అక్కడికక్కడే మృతి చెందగా, కిముడు రాజును గ్రామస్తులు సీలేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. పిలకరాజును సీలేరు పిహెచ్‌సికి తరలించి ప్రథమ చికిత్స నిర్వహించి అనంతరం అంబులెన్స్‌లో విశాఖ కెజిహెచ్‌కు తరలించారు. సంఘటనపై కిముడు కృష్ణ భార్య పూర్ణిమ పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేయడంతో ఎస్ఐ రవీంద్ర కేసు దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం నిమిత్తం సీలేరు ఎపి జెన్కో పాత చెక్‌పోస్టు సమీపంలో మృతదేహాలను భద్రపరిచారు. సంఘటన ప్రదేశాన్ని ఎఎస్‌పి నవజ్యోత్ మిశ్రా, జికెవీధి సిఐ వరప్రసాద్ పరిశీలించారు. జికెవీధి ఎస్ఐ అప్పలసూరి కూడా ఉన్నారు. సంఘటన జరిగిన తీరును గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎఎస్‌పి నవజ్యోత్ మిశ్రా మాట్లాడుతూ వంతల గెన్ను భార్య మణిని సక్రమంగా చూసుకోవడంలేదని తరచూ కొడుతున్నాడని అన్నదమ్ములు కిముడు కృష్ణ, కిముడు రాజు బావ గెన్నును నిలదీయడంతో ఘర్షణ చోటు చేసుకుందని తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని, నిందితుడి కోసం గాలింపు చర్యలు చేపడుతున్నామని ఎఎస్‌పి తెలిపారు. చింతపల్లి వైద్యాధికారి పోస్టుమార్టం చేయడానికి రావడంలో తీవ్రజాప్యం జరుగుతుండడంతో మృతదేహాలను చింతపల్లి పిహెచ్‌సికి తరలించారు.

సీలేరు కాంప్లెక్స్ చీఫ్ ఇంజినీర్‌గా స్వామినాయుడు

స్వామినాయుడు

ప్రజాశక్తి-సీలేరు: సీలేరు కాంప్లెక్స్ చీఫ్‌ఇంజనీర్‌గా స్వామినాయుడు నియమిస్తూ ఎపి జెన్‌కో విజయవాడ విద్యుత్‌సౌదా ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన విద్యుత్‌సౌదాలో చీఫ్ ఇంజనీర్‌గా విధులు నిర్వహించారు. స్వామినాయుడును సీలేరు కాంప్లెక్స్ మోతుగూడెం బదిలీ చేస్తూ ఎపి జెన్‌కో అధికారులు ఉత్తర్వులు జారీచేశారు. ఈ మేరకు ఆయన మోతుగూడెంలో బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుతం మోతుగూడెంలో చీఫ్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న వాసుదేవరావును కడప ఆర్టిపిపి స్టేషన్‌కు బదిలీ చేశారు.

పోస్టర్ ఆవిష్కరిస్తున్న సిబ్బంది

'మనమిత్ర' పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి- జికె వీధి: ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగకుండా ఉండేందుకు వివిధ పౌరసేవలను అందించడానికి రాష్ట్ర ప్రభుత్వం మనమిత్ర (వాట్సాప్ గవర్నెన్స్) మనమిత్ర ప్రజల చేతిలో ప్రభుత్వం ద్వారా వాట్సాప్ గవర్నెన్స్ సేవలను అందుబాటులోకి తీసుకువచ్చింది. ఆ సేవలపై అవగాహన కల్పిస్తూ రింతాడ గ్రామసచివాలయం కార్యాలయంలో 'మనమిత్ర' పోస్టర్‌ను సోమవారం ఆవిష్కరించారు. వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా పలు రకాల సేవలను పొందేందుకు ప్రభుత్వ వాట్సాప్ నంబర్ 9552300009ను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఉపసర్పంచ్ సోమేశ్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో విఆర్ఓ కృష్ణారావు, డిజిటల్ అసిస్టెంట్ చిన్నారావు అగ్రికల్చర్ అసిస్టెంట్ జ్యోష్ణ, మహిళా పోలీస్ శాంతి వెటర్నరీ అసిస్టెంట్ అరుణ విలేజ్ సర్వేర్ కమల పాల్గొన్నారు.

పచ్చిరొట్ట విత్తనాలతో భూసారం పెంపు

విత్తనాలు తీసుకుంటున్న రైతులు

ప్రజాశక్తి- జికెవీధి: మండలంలో రింతాడ గ్రామ సచివాలయం-1లో రైతుసాధికార సంస్థ ఆధ్వర్యంలో సోమవారం రైతుసేవా కేంద్రంలో పచ్చిరొట్ట విత్తనాలు జనుము, పిల్లిపెసర, జీలుగు పంపిణీ చేశారు. ఉపసర్పంచ్ సోమేశ్‌కుమార్ సమక్షంలో అగ్రికల్చర్ అసిస్టెంట్ జ్యోష్ణ, రైతుసాధికార సంస్థ ఐసిపిఆర్ వెంకటలక్ష్మి వీటిని పంపిణీ చేశారు. ఉపసర్పంచ్ సోమేశ్‌కుమార్ మాట్లాడుతూ ప్రధాన పంట వేసేందుకు ముందుగా పొలంలో పచ్చిరొట్ట సాగుచేసి 50 శాతం పూతదశలో ఉండగా దున్నితే నేల గుల్లబారడంతో పాటు 10 నుండి 20 శాతం రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించవచ్చన్నారు. పచ్చిరొట్ట విత్తనాలు కావాల్సిన రైతులు పట్టాదారు పాస్‌బుక్, ఆధార్ జిరాక్స్ తీసుకుని రావాలన్నారు. 10 కిలోల విత్తనాల ప్యాకెట్ రాయితీతో రూ.150కు పొందవచ్చన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆందోళన చేపడుతున్న యుటిఎఫ్ నేతలు

ఉపాధ్యాయుల సమస్యలపై..

యుటిఎఫ్ ఆధ్వర్యాన నిరసన

ప్రజాశక్తి -పాడేరు:విద్యా రంగంలో సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ యూటీఎఫ్ ఆధ్వర్యంలో సోమవారం అల్లూరి జిల్లా కేంద్రం పాడేరు లో జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయం ముందు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు వి.మహేశ్వరరావు మాట్లాడుతూ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి లోకేష్ ఎన్నికల సందర్భంగా జిఓ నెంబర్ 117 ను రద్దు చేస్తామని హామీ ఇచ్చి నేటికీ రద్దు చేయలేదన్నారు. ప్రభుత్వం ప్రతి శుక్రవారం గుర్తింపు పొందిన ఉపాధ్యాయ సంఘాలతో సమావేశాలు నిర్వహించిప్పటికి ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారం చేయడంలో నిర్లక్ష్య ధోరణి అవలంభిస్తుందన్నారు. ఫౌండేషన్ స్కూల్స్ లో 20 మంది విద్యార్థులు కంటే ఎక్కువ ఉంటే ఇద్దరు ఉపాధ్యాయులను నియమించాలనీ, బేసిక్ ప్రాథమిక పాఠశాలల్లో 21 విద్యార్థులకు ఇద్దరు ఉపాధ్యాయులను నియమించాలన్నారు. ఉపాధ్యాయుల బదిలీలు ఆఫ్లైన్ లో నిర్వహించాలని ఉపాధ్యాయ సంఘాలన్నీ డిమాండ్ చేస్తున్నాయన్నారు. ప్రభుత్వం విద్యారంగంలోని సమస్యలు పరిష్కారం చేయడంలో నిర్లక్ష్యం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శులు టి.చిట్టిబాబు, పి.దేముడు, యం.ధర్మరావు, ఎస్. కన్నయ్య, కె.రఘునాథ్, సి.నాగేశ్వరరావు, వివిధ మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు, సభ్యులు పాల్గొన్నారు.

వినతి పత్రం అందిస్తున్న నాయకులు

బస్ సౌకర్యం కల్పించాలి

ప్రజాశక్తి-హుకుంపేట:మండలంలోని బూర్జ పంచాయతీ మజ్జివలస గ్రామానికి ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని ఆర్‌టిసి రీజినల్ చైర్మన్ సియ్యారి.దొన్ను దొరకు ఆయన నివాసంలో కలిసి సోమవారం వినతి పత్రం అందజేశామని జన సేన మండలం ఉపాధ్యక్షుడు మజ్జి కృష్ణంరాజు, పల్లి నరేంద్ర కుమార్ పేర్కొన్నారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ, అరకు వ్యాలీ నుండి వేంగడ వరకు వస్తున్న బస్సును మజ్జి వలస వరకు నడపాలని కోరారు. మారుమూల ప్రాంతాల్లో ప్రైవేటు వాహనాల్లో రాకపోకలు సాగించేందుకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో జన సేన నాయకు శింబోయి పరుశురాం, బుద్ధు, గొల్లోరీ విజయ్ కుమార్, మజ్జి శోభన్ పాల్గొన్నారు.

మహిళా సంక్షేమంలో ప్రభుత్వాలు విఫలం

ప్రజాశక్తి - విఆర్.పురం: మహిళా సంక్షేమంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి అన్నారు. ఐద్వా ఆధ్వర్యంలో సున్నంవారిగూడెంలో నిర్వహిస్తున్న ఓ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తొలుత సంఘం పతాకాన్ని ఐద్వా సీనియర్ నాయకురాలు రంగమ్మ ఎగురవేశారు. మొదటిరోజు సోమవారం 'మహిళలు హక్కులు, చట్టాలు వర్తమాన రాజకీయాలు' అనే అంశంపై రమాదేవి మాట్లాడుతూ మహిళలు వివిధ రంగాల్లో ఎదుర్కొంటున్న సమస్యలపై అవగాహనతో కలిగి ఉండాలని, రాజకీయ ఆర్థిక సామాజిక రంగాల్లో రాణించాలన్నారు. ప్రభుత్వాలు మారుతున్నా మహిళల కష్టాలు మారడం లేదని గిరిజన ప్రాంతాల్లో ఆసుపత్రికి వెళ్లాలంటే డోలీమోతలే దిక్కవుతున్నాయని, పౌష్టికాహారం లేక అనేక ఆరోగ్య సమస్యలను మహిళలు ఎదుర్కోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. అందరికీ సమానహక్కులు సమాన అవకాశాలు కల్పించబడే సోషలిస్టు సమాజాన్ని నిర్మించడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు రమణి ఐద్వా నాయకులు సున్నం పార్వతి, ముర్రం రంగమ్మ సర్పంచ్‌లు పూణెం సరోజిని, వెట్టి లక్ష్మికారం, బుచ్చమ్మ బుగ్గ వెంకమ్మ, మాజీ ఎంపిపి సున్నం నాగమ్మ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఐద్వా రాష్ట్ర కార్యదర్శి రమాదేవి

మాజీ మంత్రి రజనిపై అనుచిత వ్యాఖ్యలు సరికావు

మాట్లాడుతున్న మరియదాసు

ప్రజాశక్తి-కూనవరం: మాజీమంత్రి బిసి మహిళ విడదల రజినిపై చిలకలూరిపేట సిఐ సుబ్బనాయుడు అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని వైసిపి బిసి సెల్ జిల్లా అధ్యక్షులు ఆవుల మరియదాసు ఆరోపించారు. కూటమి ప్రభుత్వం రెడ్‌బుక్ పాలన కొనసాగిస్తోందన్నారు. బిసిలు, ఎస్‌టిలు, ఎస్‌సిలు మైనార్టీలను టార్గెట్ చేసి కేసులు పెట్టి వేధింపులకు గురి చేస్తున్నారన్నారు. మాజీ మంత్రి అని కూడా చూడకుండా కారులోంచి దించి అవమానపరిచి దుర్భాషలాడిన సిఐపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇటీవల ఎస్సీ మహిళ ఎంపీటీసీని అర్ధరాత్రి రెండు గంటల సమయంలో పోలీసులు అక్రమంగా అరెస్టు చేశారని పోలీసులు తీరుకు ఈ సంఘటన అద్దం పడుతోందన్నారు. కూటమి ప్రభుత్వాన్ని ప్రజలు గమనిస్తున్నారని రాబోయే రోజుల్లో తగిన మూల్యం చెల్లించుకోకతప్పదన్నారు. అనంతరం నిరసన చేపట్టి అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో వైసిపి బిసి కార్పొరేషన్ మాజీ డైరక్టర్ దికొండ గంగాధర్, ఎంపిపి పాయం రంగమ్మ, సర్పంచ్‌లు కారం పార్వతి తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నీ ప్రారంభం

మ్యాచ్ ప్రారంభిస్తున్న ఎంపిపి రమేష్ తదితరులు

ప్రజాశక్తి-కొయ్యూరు: మండల కేంద్రంలో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. ఎంవివి ప్రసాద్ ఆధ్వర్యంలో టోర్నీ నిర్వహిస్తున్నామన్నారు. ఈ టోర్నమెంట్ ముఖ్య అతిథులుగా ఎంపిపి రమేష్, కొయ్యూరు సిఐ, సర్పంచ్ నత్తూరు సోమన్నదొర కొయ్యూరు సర్పంచ్ మాకాడ బాలరాజు, చీడిపాలెం ఎంపీటీసీ పిల్ల గంగా భవాని, ఐటిడిపి ఇన్‌చార్జి కురుజు శ్రీనుబాబు, అల్లూరు యూత్‌సభ్యులు అనిశెట్టి చిరంజీవి, అంబటి నూకరాజు, వేణు లవకుశ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. సోమవారం మొదటి మ్యాచ్ ఎవైసి బి.చింతపల్లి జట్ల మధ్య హోరాహోరా మ్యాచ్ జరిగినట్టు తెలిపారు.

డేటా ఎంట్రీ కోర్సులో శిక్షణకు దరఖాస్తులు

ప్రజాశక్తి-రంపచోడవరం : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో రంపచోడవరం నియోజకవర్గంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల, నైపుణ్యాభివృద్ధి సంస్థలో జనరల్ డ్యూటీ అసిస్టెంట్, దేశీయ డేటా ఎంట్రి ఆపరేటర్ కోర్సులో శిక్షణ తీసుకునేందుకు ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈ నెల 12వ తేదీ నుంచి దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వసుధ, డాక్టర్ పి.రోహిణి జిల్లా నైపుణ్య సంస్థ అధికారి ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణ అనంతరం ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. ఈ నెల 20 చివరితేదీ అని తెలిపారు. 90 రోజులు శిక్షణ ఉంటుందని, పదోతరగతి ఉత్తీర్ణులైనవారు అర్హులన్నారు. రంపచోడవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శిక్షణ ఉంటుందని, ఇతర వివరాలకు 6281618037. 6304634447 నంబర్లను సంప్రదించాలన్నారు.

గ్రీవెన్స్ సెల్‌కు 30 వినతులు

ప్రజాశక్తి-రంపచోడవరం : ఏజెన్సీలోని మారుమూల గ్రామాల్లో కొన్ని సమస్యలను వెంటనే పరిష్కరిస్తున్నామని, మరికొన్నింటిని సంబంధిత అధికారులకు పంపుతున్నామని ఐటిడిఎ పిఎ కట్టా సింహాచలం తెలిపారు. సోమవారం స్థానిక ఐటిడిఎ సమావేశ భవనంలో వివిధ శాఖలకు సంబంధించిన అధికారులతో ప్రజాసమస్యల పరిష్కార వేదిక (గ్రీవెన్స్) నిర్వహించారు. ఐటిడిఎ ఎపిఒ జనరల్ డిఎన్‌వి రమణ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పిఒ సింహాచలం మాట్లాడుతూ ఈ వారం 30 వినతులు వచ్చాయన్నారు.

నిరసన తెలుపుతున్న ఉపాధి కూలీలు

ఉపాధి హామీ పనులు కల్పించాలి

ప్రజాశక్తి-అరకులోయ రూరల్: మండలంలోని సుంకరమెట్ట పంచాయతీ దండబాదు, దవదగూడ అలాగే 9గ్రామాలకు ఉపాధి హామీ కూలీలకు పనులు కల్పించాలని, పనులపై అడిగిన కూలీల పై బెదిరింపులకు పాల్పడిన ఫీల్డ్ అసిస్టెంట్‌పై చర్యలు తీసుకోవాలని ఉపాధి హామీ కూలీలు సోమవారం నిరసన చేపట్టారు. ఫీల్డ్ అసిస్టెంట్ పై చర్యలు తీసుకోవాలని దండబదు గ్రామంలో నినాదాలు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఉపాధి హామీ పనులు కల్పించాలని చెప్పి నెల రోజులు కావస్తున్నా స్థానిక ఫీల్డ్ అసిస్టెంట్, టిఏ పనులు కల్పించలేదన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్‌ని పనులు కల్పించాలని అడిగితే బెదిరింపులకు పాల్పడుతున్నాడని చెప్పారు. ఆయనకు పెద్ద పెద్ద రాజకీయ నాయకులు తెలుసనని, తామి ఏమి చేయలేరని దౌర్జన్యంగా బెదిరింపులకు పాల్పడుతున్నారన్నారు. గ్రామంలో ఉపాధి హామీ పనులు కల్పించకపోవడంతో బయట కూలీ పనులకు వెళ్లలేక సుమారు 9 గ్రామాల్లో 1000 మందికి పై బడి కూలీలు ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో కార్మికుల సంఘ నాయకులు సిహెచ్ ప్రసాద్, సిహెచ్ దయానిది, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

న్యాయ సహాయకుల నియామకానికి దరఖాస్తులు

ప్రజాశక్తి-భీమునిపట్నం : న్యాయ సహాయకులుగా పనిచేసేందుకు ఆసక్తి గల వారినుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మండల న్యాయ సేవాధికార సంఘం అధ్యక్షులు, స్థానిక ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి డి.సౌజన్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలకు న్యాయ పరమైన సలహాలతో పాటు తగిన న్యాయ సహాయం చేయాలన్న ఆలోచన కలిగిన పౌరులు/స్వచ్ఛంద సంస్థల నుంచి ఈ నెల 16వ తేదీ లోపు స్థానిక కోర్టులో ఉన్న మండల న్యాయ సేవాధికార సంఘం కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని పేర్కొన్నారు. టెన్త్ పూర్తి చేసిన ఆసక్తి గల యువతీ యువకులు ఆధార్ కార్డు, విద్యార్హత జెరాక్స్ కాపీలు, ఒక పాస్‌పోర్టు సైజ్ ఫోటో, స్టాంప్ సైజ్ ఫోటోను దరఖాస్తుతో పాటు జత చేసి అందజేయాలని తెలిపారు. టెన్త్ విద్యార్హతతో పాటుగా వివిధ సేవా సంస్థల్లో పని చేసిన వారికి నియామకాల్లో ప్రాధాన్యత ఉంటుందని వివరించారు. న్యాయ సహాయకులుగా ఎంపికైన వారికి జీతం, పారితోషికం ఉండవని తెలిపారు. శిక్షణ తరగతుల అనంతరం ఏడాది కాలానికి పారా లీగల్ వాలంటీర్లుగా నియమించనున్నట్లు తెలిపారు.

పంచాయతీ కార్మికుల నిరసన

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్: నర్సీపట్నం మండలం వేములపూడి పంచాయతీ పారిశుద్ధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు నాయకులు ఈరెల్లి చిరంజీవి డిమాండ్ చేశారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయం ముందు నిరసన చేపట్టారు. నర్సీపట్నం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఈ సమస్యలపై ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు. పారిశుద్ధ్య కార్మికులకు సుమారు 18 నెలల వేతనం పెండింగ్లో ఉందన్నారు. కనీస వేతనాలు అమలు చేయాలని, సబ్బులు, కొబ్బరి నూనె, గుర్తింపు కార్డులు ఇవ్వాలని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. పరిష్కారం చేసి తక్షణమే 18 నెలల వేతనం చెల్లించాలని వినతి పత్రం ఇచ్చామన్నారు.

50 శాతం సబ్సిడీతో పశువుల దాణా

ప్రజాశక్తి- కోటవురట్ల: వేసవిలో పశుగ్రాస సమస్య నివారణకు ప్రభుత్వం 50 శాతం సబ్సిడీతో సమీకృత దాణాలు అందజేస్తున్నట్లు పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ నరేష్ అన్నారు. ఈ మేరకు సోమవారం పాడి రైతులకు మండల టిడిపి అధ్యక్షులు జానకి శ్రీను చేతుల మీదుగా అందజేశారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 1100 రూపాయల విలువగల దాణాను 550 రూపాయలకు అందజేస్తున్నామని తెలిపారు. 90 రోజులకు సరిపడా 150 కిలోల దాణాను రైతులకు గరిష్టంగా మూడు పశువులకు సరిపడా దాణాను అందజేస్తామని తెలిపారు.

ప్రమాదకరంగా రహదారులు

కోతకు గురైన బురదగెడ్డ రోడ్డు

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు: మండలంలోని అరకు సంత బయలు, ఎండపల్లి వలస మధ్యలో గల బురద గెడ్డ వంతెన రోడ్డు కోతకు గురై ప్రమాదకరంగా మారింది. ఈ రోడ్డు సుమారు ఏడాది నుంచి కోతకు గురై ఉన్నా పట్టించుకునే నాథుడే లేడు. ప్రాణాలు పోతేనే స్పందిస్తారా !అంటూ అధికారులు తీరును స్థానికులు, వాహనదారులు, పర్యాటకులు ప్రశ్నిస్తున్నారు. అరకు -పాడేరుకు ప్రధాన ఈ రోడ్డులో నిత్యం అధిక సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. ప్రధానంగా కార్తీక మాసంలో, వేసవి సెలవుల్లో కూడా పర్యాటకులు అధిక సంఖ్యలో రాకపోకలు సాగిస్తున్నారు. దీంతో నిత్యం ఈ రోడ్డు రద్దీగా ఉంటుంది. ప్రమాదవశాత్తు అదుపుతప్పి వాహనం కోతకు గురైన గోతిలో దిగితే ప్రాణాలు పోయే పరిస్థితి ఉంటుందని పలువురు వాహనదారులు, ప్రయాణికులు అంటున్నారు. చిన్నపాటి కోతకుగురైన రోడ్డు పూడ్చడంలో నిర్లక్ష్యం చేయడంతో ప్రస్తుతం సగం వరకు దెబ్బతింది. ప్రమాదకరంగా ఉన్న ఈ రోడ్డును పూడ్చి మరమ్మతు చేయాలని సిపిఎం, గిరిజన సంఘం, కాంగ్రెస్ పార్టీ నాయకులు పలుమార్లు ఆ ప్రదేశాన్ని సందర్శించి ఆందోళన చేశారు. తక్షణమే సంబంధిత అధికారులు స్పందించి మరమ్మతు చేపట్టాలని స్థానికులు, ప్రయాణికులు, వాహనదారులు కోరుతున్నారు.

తారు రోడ్డు నిర్మించరూ..

ప్రజాశక్తి-అనంతగిరి: మండలంలోని కాశీపట్నం పంచాయతీ సీతంపేట గ్రామనికి రోడ్డు సౌకర్యం లేక నానా అవస్థలు పడుతున్నామని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా స్థానిక విలేకరులతో గ్రామస్తుడు సిఎస్ .సూర్యనారాయణ మాట్లాడుతూ, తమ గ్రామంలో 20 కుటుంబాలు పూర్వకాలం నుండి నివసిస్తున్నామన్నారు. గుమ్మకోట మెయిన్ రోడ్డు నుండి తమ గ్రామం వరకు సుమారు మూడు కిలోమీటర్లు దూరం ఉంటుందని, వర్షాకాలంలో మట్టి రోడ్డు గోతులు మయంగా మారుతుందన్నారు. దీంతో వాహనాలు రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బంది పడుతునామన్నారు. 108 అంబులెన్స్ రాని పరిస్థితి ఉందన్నారు. రోడ్డు సమస్యపై సంబంధిత ఉన్నతా అధికారులకు లిఖిత పూర్వకంగా విన్నవించిన ఫలితం లేదని, స్థానిక ప్రజాప్రతినిధుల దృష్టికి కూడా తీసుకెళ్లినప్పటికీ పట్టించుకునే నాథుడే కరువయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం తక్షణమే స్పందించి రోడ్డు నిర్మాణం చేయాలని డిమాండ్ చేశారు.

రాళ్లు తేలిన రోడ్డు

గీతం వర్సిటీ ఎఫ్‌డిపిలో పాల్గొన్న నిపుణులు

సంప్రదాయేతర ఇంధనంతో విద్యుత్ వాహన అనుసంధానం

ప్రజాశక్తి-మధురవాడ : సంప్రదాయేతర ఇంధన వనరులైన సౌర, పవన విద్యుత్తును కృత్రిమ మేధ సహకారంతో విద్యుత్తు వాహనాలకు అనుసంధానం చేయడంపై గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ టెక్నాలజి ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యాన ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ కార్యక్రమం (ఎఫ్‌డిపి) సోమవారం నిర్వహించారు. ఐఐటి జోధ్‌పూర్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ నిశాంత్‌కుమార్, ఐఐటి భువనేశ్వర్ అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎన్‌కె.స్వామినాయుడు, అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్ మిస్సోరీ కాన్సాస్ పరిశోధకుడు డాక్టర్ జి.ప్రీతం, రాధానుటెక్నాలజీస్ వ్యవస్థాపకుడు డాక్టర్ ఎల్ఎన్.శాస్త్రి రిసోర్స్ పర్సన్‌లుగా హాజరై అధ్యాపకులకు దిశానిర్దేశం చేశారు. సంప్రదాయేతర విధానాలలో ఉత్పత్తి అయ్యే విద్యుత్తు శక్తిని కృత్రిమ మేధ సహాయంతో స్మార్ట్ గ్రిడ్‌లకు కలుపుతూ తద్వారా అవసరమైన విధంగా విద్యుత్తు వాహనాలను ఏవిధంగా రీచార్జి చేయవచ్చో వివరించారు. సౌరశక్తితో నడిచే విద్యుత్తు వాహనాలు, స్మార్ట్ ఛార్జింగ్, బ్యాటరీల సామర్థ్యంతో పాటు భవిష్యత్తులో పెరగనున్న విద్యుత్తు వాహనాల సాంకేతిక పరిజ్ఞానాన్ని తెలియజేశారు. ఈ రంగంలో పరిశోధనలకు గల అవకాశాలను అధ్యాపకులు అధ్యయనం చేయాలని సూచించారు. విశాఖపట్నం, హైదరాబాద్, బెంగళూరు ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున అధ్యాపకులు ఈ ఎఫ్‌డిపి కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమానికి కన్వీనర్లుగా డాక్టర్ యు.సల్మా, డాక్టర్ ఐఇఎస్.నాయుడు, డాక్టర్ ఎస్.శ్రీనివాసరావు వ్యవహరించారు.

పింఛన్ పంపిణీ బాధ్యతల నుంచి అంగన్వాడీలకు మినహాయింపు ఇవ్వాలి

ప్రజాశక్తి -నక్కపల్లి

తమకు పని భారం పెరిగిందని, పింఛన్ పంపిణీ డ్యూటీ నుండి అంగన్వాడి వర్కర్స్ కు మినహాయింపు నివ్వాలని ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు దుర్గారాణి, యూనియన్ నాయకులు కోరారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో సీతారామరాజును కలిసి సమస్యను విన్నవించి, వినతిపత్రం అందజేశారు.

ప్రభుత్వం వచ్చిన కొత్త లో గ్రామాల్లో లబ్ధిదారులకు పెన్షన్ పంపిణీలో సచివాలయం సిబ్బందికి 2,3 నెలలు సహకరించాలని కోరడంతో రకరకాలు యాప్స్‌తో పనిభారం ఉన్నప్పటికీ అంగీకరించా మన్నారు. పెన్షన్ పంపిణీ చేసిన సమయంలో అమౌంట్ కూడా అంగన్వాడి కార్యకర్తలకు ఇచ్చి కొన్ని చోట్ల పెన్షన్ పంపిణీ చేయమంటున్నారని, ఇప్పటికే యాప్‌లతో పని ఒత్తిడి పెరిగి ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. 1వ తేదీ నుంచి పిల్లల బరువు తీయడం, టి హెచ్ ఆర్ పంపిణీ చేయడం, పిల్లలకు పోషకాహారం వండి పెట్టడం, ప్రీ స్కూల్ నిర్వహించటం, యాప్ లలో అప్లోడ్ చేయడం ఇలా అనేక పనులతో సతమతమవుతున్న పరిస్థితిలోను, ఒత్తిడిలోనూ ఉంటున్న తమతో పింఛన్ నగదు పంపిణీ చేయమంటున్నారని, ఏ చిన్న పొరపాటు జరిగినా తమ ఉద్యోగాలకు ముప్పు ఏర్పడే పరిస్థితి ఏర్పడుతుందని ఆవేదన వెలిబుచ్చారు. గుంటూరులో ఇటీవల రాజకీయ జోక్యం కారణంగా ఒక వర్కర్ ను ఉదోగ్యం విధుల నుండి తొలగించడం జరిగిందన్నారు. తమతో పింఛన్ పంపిణీ చేపట్టడంతో అంగన్వాడి సెంటర్ల విధుల నిర్వహణకు ఆటంకం ఏర్పడుతుందని, తమ పరిస్థితిని అర్థం చేసుకుని పింఛన్ పంపిణీ డ్యూటీ నుండి మినహాయింపు నివ్వాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.

సమ్మెను జయప్రదం చేయాలి

బుక్‌లెట్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

ప్రజాశక్తి-హుకుంపేట: ఈనెల 20న జరిగే సమ్మెపై రూపొందించిన పుస్తకాన్ని గిరిజన మహిళ సంఘం (ఐద్వా) జిల్లా నాయకులు సొంటేన హైమావతి, వైస్ ఎంపీపీ సూడిపల్లి కొండలరావు ఆధ్వర్యంలో సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా హైమావతి మాట్లాడుతూ, లేబర్ కోడ్‌లను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులకు కనీస వేతనం రూ.26వేలకు పెంచాలన్నారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ ఆపాలని డిమాండ్ చేశారు. వైస్ ఎంపీపీ కొండలరావు మాట్లాడుతూ, సమ్మెలో అంగన్ వాడీ, ఆశా, మిడ్ డే మీల్స్ వర్కర్స్, శానిటరీ వర్కర్స్, హాస్టల్ వర్కర్స్, లైజన్ వర్కర్స్, ఉపాధిహామీ ఫీల్డ్ అసిస్టెంట్స్ పెద్ద ఎత్తున పాల్గొని విజయ వంతం చేయాలనీ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్టెమ్స్ అసోషియేషన్ ప్రతినిధి కిల్లో దయానిధి, ఆదివాసీ గిరిజన సంఘం మండల కార్యదర్శి తాపుల కృష్ణా రావు, పీసా మండల అధ్యక్ష కార్యదర్శులు చప్పలి శంకర్ రావు, జన్ని వెంకట రమణ, పీసా మండల నాయకులు సాగోరి అప్పల కొండ, పాడి భరత్, మజ్జి రామకృష్ణ, సమరెడ్డి లక్ష్మీ గణేష్, జయా, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

డుంబ్రిగుడలో భారీ వర్షం

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: మండలంలో సోమవారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. సుమారు రెండు గంటలపాటు ఏకధాటిగా పిడుగుల శబ్దాలతో వర్షం కురిసింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎండలు ఎక్కువగా కాయగా ఆ తర్వాత వర్షం కురిసింది. గత రెండు రోజుల నుంచి ఎండలు ఎక్కువగా ఉండటంతో ఉక్కపోతకు గురైన గిరిజనులకు ఈ వర్షం కొంత ఉపశమనం లభించింది.

ఘనంగా అంతర్జాతీయ నర్సుల దినోత్సవం

ప్రజాశక్తి-పాడేరుటౌన్: అంతర్జాతీయ నర్సుల దినోత్సవాలను సోమవారం అల్లూరి జిల్లా కేంద్రం పాడేరు ప్రభుత్వ ఆసుపత్రిలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మెడికల్ సూపరిం టెండెంట్ విశ్వమిత్ర ముఖ్య అతిథిగా హాజరై కేక్ కట్ చేశారు. రోగులకు పాలు, రొట్టెలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఫ్లోరెన్స్ నైటింగేల్ నర్సింగ్ రంగానికి చేసిన సేవలకు గుర్తుగా ఆమె జన్మదినం మే 12ను అంతర్జాతీయ నర్సుల దినోత్సవంగా జరపాలని ఇంటర్నేషనల్ కౌన్సిల్ ఆఫ్ నర్సెస్ (ఐసిఎన్) 1965లో తీర్మానించిందని తెలిపారు. వైద్యరంగంలో నర్సుల సహకారాన్ని గుర్తించే లక్ష్యంతో ప్రపంచ వ్యాప్తంగా ఏటా మే 12న అంతర్జాతీయ నర్సుల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ సూపరిండెంట్ ఎర్రయ్య, మెడిసిన్ ప్రొఫెసర్, హెచ్ఒడి సురేశ్వరరెడ్డి, నర్సింగ్ సూపరిండెంట్ అన్నపూర్ణ, ఆర్ఎంఒ .వెంకట్, హెడ్ నర్సులు పాల్గొన్నారు.

పాలు, రొట్టెలను పంపిణీ చేస్తున్న వైద్యులు

చింతూరు: చింతూరు ప్రభుత్వ ఆసుపత్రిలో అంతర్జాతీయ నర్సుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. సూపరింటెండెంట్ డాక్టర్ ఎంవి కోటిరెడ్డి మాట్లాడుతూ రోగుల ఆరోగ్య సంరక్షణలో నర్సులు కీలక పాత్ర పోషిస్తున్నారన్నారు. కార్యక్రమంలో డాక్టర్ సాయికిషోర్‌రెడ్డి, డాక్టర్ శ్రీహర్ష, డాక్టర్ స్పందన, డాక్టర్ భరద్వాజ్, డాక్టర్ సుధీర్, ఎస్ఎన్‌సియూ, హెడ్ నర్స్ కుమారి సిబ్బంది పాల్గొన్నారు.

జివిఎంసి ప్రత్యేక సమావేశం మినిట్స్ ఇవ్వండి

ప్రజాశక్తి- విశాఖకలెక్టరేట్: ఏప్రిల్ 19న జరిగిన జివిఎంసి ప్రత్యేక సమావేశం యొక్క ప్రక్రియల మినిట్స్ ప్రతిని ఇవ్వాలని, జివిఎంసి ఇన్‌చార్జి కమిషనర్, జిల్లాకలెక్టర్ ఎం.ఎన్‌హరేంధిరప్రసాద్‌ను వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే తైనాల విజయకుమార్, వైసిపి ఆఫీస్ ఇన్‌చార్జి రవిరెడ్డి ప్రజాసమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్‌కు అందించిన వినతిపత్రంలో కోరారు. ఏప్రిల్ 19 న నిర్వహించిన సమావేశంలో గొలగాని హరివెంకటకుమారి (జివిఎంసి మేయర్) పై అవిశ్వాస తీర్మాన సమావేశం సందర్భంగా వైసిపి నియమిత పార్టీ విప్‌గా తాము కోరిన పై పత్రాలను వీలైనంత త్వరగా అందజేయాల్సిందిగా కోరారు. తమ ఫిర్యాదులపై తగు చర్యలు తీసుకోవాలని అభ్యర్థించారు.

వినతిపత్రం ఇస్తున్న వైసిపి నాయకులు

సంతలో చలివేంద్రం ఏర్పాటు చేయరూ.. !

ప్రజాశక్తి-విఆర్‌పురం: మండలంలో విఆర్‌పురంలో వారం, వారం జరిగే సంతలో చలివేంద్రం ఏర్పాటు చేయాలని ఆయా గ్రామాల గిరిజనులు కోరుతు న్నారు. ఎండల తీవ్రత ఎక్కువగా ఉండడం వల్ల వివిధ గ్రామాల నుంచి సంతకు వచ్చే వారు అవస్థలు పడుతున్నారు. చలివేంద్రం ఏర్పాటు చేయాలని అదేవిధంగా సంతలో వైద్యశిబి రాన్ని కూడా ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

సంత ప్రాంతం

స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకుంటాం

ప్రజాశక్తి -ఉక్కునగరం : వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను పోరాటాలతో కాపాడుకుంటామని స్టీల్‌ప్లాంట్ ఒబిసి అసోసియేషన్ అధ్యక్షులు బి.అప్పారావు స్పష్టం చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు సోమవారానికి 1551 రోజులకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్నకాలంలో ఉక్కు పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామన్నారు. దశాబ్దాలుగా విశాఖ అభివృద్ధికి స్టీల్‌ప్లాంట్ ఎంతదోహదపడిందో మరిచిపోతే ఎలా అని ప్రశ్నించారు. ప్లాంట్ ప్రైవేటీకరణ అయితే కర్మాగారంపై ప్రత్యక్షంగా, పరోక్షంగా ఆధారపడి బతుకుతున్న వారందరికీ ఇబ్బందులు ఎదురుకానున్నాయన్నారు. ఇప్పటికైనా కేంద్రప్రభుత్వం తన నిర్ణయాన్ని మార్చుకోవాలన్నారు.

అమరావతితో పాటు అన్ని ప్రాంతాలనూ అభివృద్ధి చేయాలి

సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి సత్యనారాయణమూర్తి

మాట్లాడుతున్న జె.వి.సత్యనారాయణమూర్తి

ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్: రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం అమరావతినే అభివృద్ధి చేస్తూ మిగతా ప్రాంతాలను విస్మరిస్తోందని, సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జె.వి.సత్యనారాయణమూర్తి తప్పుపట్టారు. విశాఖ అల్లిపురంలోని సిపిఐ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అమరావతి కోసం ఇప్పటికి సేకరించిన 40 వేల ఎకరాలు కాకుండా మరో 40 వేల ఎకరాలు సేకరిస్తున్నారని దుయ్యబట్టారు. అమరావతికి గన్నవరం 30 కిలోమీటర్ల దూరంలో ఉందని, గన్నవరం విమానాశ్రయాన్ని అభివృద్ధి చేస్తుంటే అమరావతిలో మరో అంతర్జాతీయ విమానాశ్రయానికి 4 వేల ఎకరాలు కేటాయించడాన్ని తప్పుపట్టారు. అమరావతిలో రైల్వేస్టేషన్ కోసం 2,600 ఎకరాలు కేటాయించారని, దేశంలో ఎక్కడా ఇంత కేటాయించలేదన్నారు. విశాఖ కేంద్రంగా ఐటీని అభివృద్ధి చేస్తామని చెప్పి అమరావతిలో ఐకానిక్ టవర్లను నిర్మిస్తున్నారన్నారు. విశాఖలో టిసిఎస్ ఏర్పాటుకు ఒప్పందం కుదిరినా టిసిఎస్ ఎప్పుడు కార్యకలాపాలు ప్రారంభిస్తుందో తెలియదన్నారు. విశాఖలో ఫ్రాంక్లిన్ టెంపుల్టన్ సంస్థకు భూములు కేటాయించారని, ఇప్పటివరకూ ఆ సంస్థ పునాదిరాయి కూడా వేయలేదని విమర్శించారు. భోగాపురం విమానాశ్రయాన్ని అనుసంధానం చేస్తూ రహదారులను ఇప్పటి వరకు అభివృద్ధి చేయలేదన్నారు. విశాఖ మెట్రో కారిడార్‌పై కేంద్రం నుంచి ఇప్పటి వరకూ స్పష్టమైన ప్రకటన లేదన్నారు. తెలుగుదేశం హయాంలో నిర్మించిన టిడ్కో గృహాలను లబ్దిదారులకు అప్పగించాలని, టిడ్కో గృహాల వద్ద మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ అడ్డుకునేందుకు కూటమి ప్రభుత్వం ఎటువంటి ప్రయత్నాలు చేయడం లేదన్నారు.

కెసిఎస్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు రాజు డిమాండ్

మాట్లాడుతున్న వై.రాజు

ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్: పోర్టు ప్రాంతంలో గోడలకు రంగులు, బొమ్మలు వేసిన కళాకారుల కష్టార్జితం ఎగ్గొట్టడానికి కుట్ర చేయడమే కాకుండా, కళాకారులను గుండాల చేత బెదిరింపుల గురి చేసిన కె.సి.ఎస్ కన్‌స్ట్రక్షన్స్ యాజమాన్యంపై చర్య తీసుకోవాలని కెవిపిఎస్ విశాఖ జిల్లా ఉపాధ్యక్షులు వై.రాజు డిమాండ్ చేశారు. సోమవారం జగదాంబ దరి సిఐటియు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, పది మంది ఆర్టిస్టులు కెసిఎస్ కన్‌స్ట్రక్షన్ యాజమాన్యం వద్ద సుమారు ఏడాది పాటు కష్టపడి పనులు చేశారన్నారు. పోర్టుయాజమాన్యం కాంట్రాక్టర్ నుంచి కళాకారులకు రావాల్సిన నగదు ఇప్పించాలని డిమాండ్ చేశారు. పనులు పూర్తయి 4 నెలలు గడిచినా ఇవ్వాల్సిన నగదు ఇవ్వకుండా కాలయాపన చేస్తున్నారన్నారు. మొత్తం లేబర్ చార్జి రూ.18 లక్షలు అయిందని, అడ్వాన్స్ పోగా రూ.11 లక్షల 7 వేలు కాంట్రాక్టర్ ఎగ్గొటాలని కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. దీనిపై పోర్టు అధికారులకు ఫిర్యాదు చేశామని, ఫిర్యాదు చేసి 3 వారాలు గడిచినప్పటికీ, ఇంతవరకూ చర్యలు తీసుకోలేదని విమర్శించారు. ఇప్పటికైనా వారికి రావాల్సిన మొత్తం నగదు చెల్లించకుంటే బాధితులతో సీహార్స్ జంక్షన్‌లో పెద్దఎత్తున ఆందోళన నిర్వహిస్తామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో ఎన్.సూరిబాబు, సిహెచ్‌రాజు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ భవనం పూర్తయ్యేనా?

ప్రజాశక్తి-అడ్డతీగల: అడ్డతీగల మండలం గొండోలు పంచాయతీ గొండోలు, సరంపేటలో 2016లో అంగన్‌వాడీ భవనం నిర్మించి అసంపూర్తిగా వదిలివేశారు. జాతీయ మానవ హక్కుల పరిరక్షణ సంస్థ రంపచోడవరం నియోజకవర్గ ఇన్‌చార్జి రాంప్రసాద్, మహిళా విభాగ నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీదేవి సూచన మేరకు అడ్డతీగల మండల అధ్యక్షుడు ఎస్‌వి.రమణ, ఉపాధ్యక్షుడు నవాజ్ పర్యటించి అసంపూర్తిగా వదిలివేసిన అంగన్‌వాడీ కేంద్రాలను, స్కూళ్లను పరిశీలించి సమస్యను జాతీయ మానవ హక్కుల పరిరక్షణ సంస్థ దృష్టికి తీసుకువెళ్లామన్నారు. త్వరలో అసంపూర్తిగా ఉన్న భవనాల నిర్మాణం పూర్తవుతుందని తెలిపారు.

సరంపేటలో నిర్మాణంలో ఉన్న అంగన్‌వాడీ భవనం

మేయర్‌ను సత్కరించిన జనసేన కార్పొరేటర్లు

మేయర్‌ను సత్కరిస్తున్న జనసేన కార్పొరేటర్లు

ప్రజాశక్తి-ఎంవిపి కాలనీ: విశాఖ నగర మేయర్‌గా ఎన్నికైన పీలా శ్రీనివాసరావును జివిఎంసి జనసేన ఫ్లోర్‌లీడర్ బీశెట్టి వసంతలక్ష్మి ఆధ్వర్యంలో జనసేన కార్పొరేటర్లందరూ జివిఎంసి ప్రధాన కార్యాలయంలో ఆయన ఛాంబర్‌లో సోమవారం కలిసి ఆయనను సన్మానించారు. నగరపాలకసంస్థలో చేపట్టిన కార్యక్రమాలు సకాలంలో పూర్తి చేసి విశాఖ నగరాన్ని అభివృద్ధి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ అందరి సహకారంతో విశాఖ నగర అభివృద్ధికి శక్తివంచన లేకుండా పనిచేస్తానని అందుకు అందరూ సహకరించాలని కార్పొరేటర్లకు మేయర్ తెలిపారు. కార్యక్రమంలో జనసేన డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ గోవిందరెడ్డి, పీతలమూర్తి యాదవ్, కందుల నాగరాజు, సాదిక్, లీలావతి, ఉషశ్రీ, సూర్య కుమారి, మేరీ జోన్స్, వంశీ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బస్సులను కండిషన్‌లో ఉంచాలి

మద్దిలపాలెం డిపోను పరిశీలిస్తున్న అప్పలనాయుడు

ప్రజాశక్తి- విశాఖకలెక్టరేట్: ట్రాఫిక్ రద్దీ అధికంగా ఉన్నందున బస్సులన్నింటినీ కండిషన్‌లో ఉంచాలని విశాఖ జిల్లా ప్రజారవాణా అధికారి బి.అప్పలనాయుడు సిబ్బందిని ఆదేశించారు. సోమవారం ఆయన మద్దిలపాలెం సిటీ డిపోని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్స్, సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడుతూ రద్దీకి అనుకూలంగా బస్సులు తిప్పాలన్నారు. విశాఖపట్నం, పాడేరుకు సుమారు 20 బస్సులు తిరుగుతున్నాయని, మోదకొండమ్మ అమ్మవారి జాతరకు స్పెషల్ బస్సులు తిరుగుతున్నాయని ప్రయాణికులకు ఉపయోగపడేలా మరింత సౌకర్యాలు అందించాలన్నారు. ఈ నెల 18 నుంచి 22 వరకు సాలూరులో జరిగే శ్యామలాంబ అమ్మవారి జాతరకు కూడా సుమారు 100 బస్సులు నడపాలన్నారు. ప్రయాణికులను ఆకర్షించే విధంగా సర్వీసులు నడిపి బస్సులన్నీ కండిషన్‌లో ఉంచాలన్నారు. మద్దిలపాలెం డిపోలో ఆదర్శ ఉద్యోగులకు అవార్డును ప్రధానం చేశారు. కార్యక్రమానికి మద్దిలపాలెం డిపో మేనేజర్ అరుణ కుమారి, అసిస్టెంట్ ఇంజనీర్ బిందు, అసిస్టెంట్ మేనేజర్ మాధురి, స్టేషన్ మేనేజర్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

నేడు జెడ్‌పి స్థాయీ సంఘ సమావేశాలు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్: జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ అధ్యక్షతన మంగళవారం జెడ్‌పి స్థాయీ సంఘ సమావేశాలు నిర్వహించనున్నట్టు జిల్లాపరిషత్ సిఈవో పి. నారాయణమూర్తి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జెడ్‌పి చైర్‌పర్సన్ జె.సుభద్ర అధ్యక్షతన వి.సి.హాలులో, జెడ్‌పి సమావేశ మందిరంలో స్థాయీ సంఘ సమావేశాలు వేర్వేరుగా ఉదయం 10 గంటల నుంచి 12 వరకు జరుగుతాయన్నారు. 2, 5వ స్థాయీ సంఘ సమావేశాలు ఉదయం 10 గంటలకు, 3, 4వ స్థాయీ సంఘ సమావేశాలు 11 గంటలకు, 1,6,7 వ స్థాయీ సంఘ సమావేశాలు ఉదయం 12 గంటలకు జరుగుతాయని, ప్రాదేశిక నియోజకవర్గ సభ్యులు, ఎంపిపిలు,సంబంధించిన ప్రగతి నివేదికతో అధికారులు సమావేశాలకు హాజరుకావాలని కోరారు.